క్లుప్తంగా

జనన ధ్రువీకరణ పత్రాలు అందజేత



బర్త్ సర్టిఫికెట్ అందుకున్న పిల్లలతో అధికారులు

వేటపాలెం: జనన ధ్రువీకరణ పత్రాలు లేక ఆధార్ ఎన్‌రోల్ చేయించు కోలేక పోయిన 56 మంది యానాదులకు ఆర్డీఓ జారీచేసిన లేట్ బర్త్ సర్టిఫికెట్లను మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎంవీస్ శర్మ బుధవారం అందజేశారు. యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటగిరి సంజీవరావు, రాష్ట్ర యూత్ ఆర్గనైజర్ గంధళ్ల నరేష్ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన యానాదుల, చిన్నపిల్లలు ఆధార్ కార్డులు లేక ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్నారని తెలిపారు. డాక్టర్ సాయి వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

యాప్‌పై అవగాహన అవసరం



కార్యకర్తలతో మాట్లాడుతున్న సీడీపీఓ

బల్లికురవ: బాల సంజీవని యాప్‌పై అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి. సుధ కోరారు. బుధవారం కొప్పరపాడు బల్లికురవలో కార్యకర్తలతో మాట్లాడారు. యాప్‌లోనే హాజరు, రేషన్ సరుకులు పంపిణీ స్టాక్ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సూపర్ వైజర్లు, విజయ నిర్మల సలోమి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం రేపు



ఉచిత నేత్రవైద్య శిబిరం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గీతామందిరంలో నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సభ్యులు ఆవిష్కరించారు. వైద్యశిబిరాన్ని అద్దంకి, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, చిన్ని మురళీ కృష్ణ, షేక్ మహమ్మద్ రఫీ, న్యాయవాది గృహలక్ష్మి, శ్రీలక్ష్మీ, శివకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా షబ్బీర్



పొదిలి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా షేక్.షబ్బీర్ నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి నియామక పత్రం అందుకున్నారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ధర్నాసి రామారావు ఉన్నారు. తన నియామకానికి సహకరించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి షబ్బీర్ కృతజ్ఞతలు తెలిపారు. షబ్బీర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ల అధ్యక్షుడిగా కేశవ



దొనకొండ: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపునేని కేశవ, ఉపాధ్యక్షుడిగా దయ్యాల బాలయ్య, కార్యదర్శిగా సత్యనారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని మారెళ్ల పొలాల్లో ఓ రైతు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. బాధిత రైతు గాలం శ్రీను కథనం ప్రకారం.. పంటలను కాపాడుకునేందుకు బోరు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శ్రీను ఏర్పాటు చేసుకున్నాడు. ఎండలు మండుతుండటంతో పంటలు కాపాడుకునేందుకు బోరును వినియోగిస్తున్నాడు. బుధవారం యథావిధిగా పొలం వద్దకు వెళ్లే సరికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడేసి పగలగొట్టి ఉండటం గమనించాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని తీగను చోరీ చేసినట్లు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీను తెలిపాడు.

ఆదాయం ఘనం.. వసతులు శూన్యం

పట్టణ జనాభా	50 వేలు
విస్తీర్ణం	25 చదరపు కిలోమీటర్లు
వార్డులు	20
గృహాలు	11వేలు
సంవత్సర ఆదాయం	రూ.5 కోట్లు

- అద్దంకి పట్టణంలో కనిపించని మౌలిక వసతులు

అద్దంకి: చారిత్రక ప్రాధాన్యత ఉన్న అద్దంకి పట్టణంలో కనీసవ వసతులు మృగ్యమయ్యాయి. పట్టణాన్ని చూస్తే ఆదాయం ఘనం వసతులు శూన్యం అన్నచందంగా ఉంది. అద్దంకిలో జనాభా యాభై వేలకు మించినా వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. 2011లో మేజర్ పంచాయతీ నుంచి అద్దంకి.. నగర పంచాయతీగా.. రెండు సంవత్సరాల క్రితం మునిసిపాలిటీగానూ మారింది. పురాతన పట్టణంగా భాసిల్లిన ఈ ప్రాంతం దాదాపు 25 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించింది. నియోజకవర్గ కేంద్రంగా, వ్యాపార లావాదేవీలకు ప్రాధాన్యత ఉండటంతో చుట్టు పక్కల నుంచి నిత్యం వందకు పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే అద్దంకి -నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి ఉండటంతో ప్రయాణాలకు అనువుగా మారింది.

రోడ్డు పక్కనే..

పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగిపోతోంది. దీనికి తగినట్లుగా మటన్, చికెన్, పండ్లు, కూరగాయలు.. దుకాణాల సముదాయం ఇంత వరకూ లేకపోవడంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. ఈ క్రమంలో ఆయా దుకాణాల యజమానులు ప్రధాన రోడ్డు పక్కనే వివిధ షాపులు ఏర్పాటు చేశారు. ఇలా వీటి వద్ద కొనుగోలుదారులు చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోంది.



రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన పండ్లు, కూరగాయాల దుకాణాలు



ఇటీవల ఏర్పాటు చేసిన టాయిలెట్ సముదాయం

పబ్లిక్ టాయ్‌లెట్స్ సరిపోతాయా?

పట్టణంలో నివసించే వేలాది మందికి తోడు చుట్టు పక్కల నుంచి ఎంతో మంది అద్దంకి చేరుకుంటారు. అయితే వారికి అత్యంత అవసరమైన పబ్లిక్ టాయ్‌లెట్స్ మాత్రం సరిపడా లేవు. ఇటీవల మునిసిపల్ కార్యాలయం దగ్గరలో ఒక కాంప్లెక్స్ ఏర్పాటు చేసినా అది ఎంతమందికి సరిపోతుందో పాలకులే చెప్పాలి. ముఖ్యంగా రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మరికొన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రం ఏర్పడిన తరువాత అద్దంకి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంఎల్‌ఏకి మంత్రి పదవి రావడంతో ఇకనైనా కనీస వసతులు సమకూరుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. అటువైపుగా ప్రజా ప్రతినిధి ఆలోచించి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం: కమిషనర్ రవీంద్ర

పట్టణంలోని బస్టాండు సమీంపలో ఒకటి, మరొకటి రిజిస్టర్ కార్యాలయం సమీపంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు కోసం ప్రపోజల్స్ పంపాం. అదే విధంగా మటన్, చికెన్ మార్కెట్లు ఏర్పాటుకు స్థలాలను పరిశీలించి అనువైన చోట ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాం.

> **జానాభాకు తగిన విధంగా వసతులు కల్పించాలి**
>
> పెరిగిన జనాభా ,పట్టణ విస్తీర్ణాన్ని బట్టి మౌలిక వసుతులు కల్పించాలి. మటన్, చికెన్ పండ్లు కూరగాయల మార్కెట్ సముదాయాలు ఉంటే బాగుంటుంది. అమ్మకందారులకు కొనుగోలు దారులకు కూడా సౌకర్యంగా ఉంటుంది.
>
> చెన్నుపాటి రామాంజనేయులు



రెండు గ్రామాల్లో నేడు రీసర్వే

యద్దనపూడి: రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పోలూరు, యనమదల గ్రామాల్లో గురువారం భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కె. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పోలూరు గ్రామంలో,10.30 గంటలకు యనమదలలో భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

రేషన్ నిల్వ చేస్తే చర్యలు



బియ్యాన్ని సీజ్ చేస్తున్న తహసీల్దార్ గోపికృష్ణ, ఇతర అధికారులు

చీరాల టౌన్: పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ సరుకులను అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో తహసీల్దార్ కె.గోపికృష్ణ తనిఖీ చేశారు. బుధవారం పట్టణంలోని విఠల్ నగర్‌లోని 19వ నెంబర్ రేషన్ దుకాణంలో బియ్యం, కందిపప్పు, పంచదార నిల్వ చేశారని సమాచారంతో డీలర్ కుమార్‌కు చెందిన 19వ నెంబర్ దుకాణంలో తనిఖీ చేశారు. బియ్యం 244.3 క్వింటాళ్లు, పంచదార 460 ప్యాకెట్లు, కందిపప్పు 418 ప్యాకెట్లు నిల్వ లేకపోవడంతో పాటు బియ్యం అక్రమంగా నిల్వ చేయడంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రేషన్ డీలర్లు ప్రజాపంపిణీ సరుకులను సక్రమంగా పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీటీ గీతారాణి, ఆర్‌ఐ సత్యం, వీఆర్వో కళ్యాణ్, సిబ్బంది ఉన్నారు.

దాతల సహకారంతో ఉన్నత స్థితికి చేరుకోవాలి

ఇంకొల్లు(చినగంజాం): దాతలు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థి అంబటి సుబ్బారావు సోదరి పొన్నం అనంత లక్ష్మి తన భర్త వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ. 1 లక్ష పాఠశాలకు డిపాజిట్ చేసి డాక్యుమెంట్ అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు హెచ్‌ఎం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. ప్రతి విద్యార్థి పోటీ తత్వంతో ఇష్టపడి కష్టంతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. స్థానిక కెనరా బ్యాంకులో రూ. 1 లక్ష డిపాజిట్ చేసి డిపాజిట్‌పై వచ్చే వడ్డీ ప్రతి సంవత్సరం పాఠశాలలో 10 వ తరగతిలో మొదటి స్థానంలో వచ్చే విద్యార్థికి నగదు బహుమతిగా ఇవ్వాలని డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఇడుపులపాడు పొన్నం అనంతలక్ష్మి ట్రస్టు ప్రతినిధి బొగ్గవరపు సుబ్బారావు, హెచ్‌ఎంకు రూ. లక్ష డిపాజిట్ డాక్యుమెంట్ అందజేశారు.



హెచ్‌ఎం పేరిరెడ్డికి లక్ష నగదు బ్యాంకు డాక్యుమెంట్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

యద్దనపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బ్యాంక్ అధికారులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డు, కుల, విద్యార్హత, సంబంధించిన ధ్రువపత్రాలు ఒరిజినల్.. జెరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు.

మిన్నెకల్లులో మోటారు చోరీ

సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని మిన్నెకల్లు గ్రామంలో మోటారు చోరీకి గురైంది. గ్రామంలోని అమ్ము డీలక్స్ ఆవరణలో ఉంచిన రూ.40 వేలు విలువ చేసే 7.5 హెచ్‌పీ మోనోబ్లాక్ మోటారును మంగళవారం రాత్రి గుర్తు తెలియని చోరులు అపహరించారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మత్తుపదార్థాలతో అనర్థాలు తప్పవు

అద్దంకి: మత్తు పదార్థాలకు అలవాటు పడితే అనర్థాలు తప్పవని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ లాజరస్ అన్నారు.కళాశాలలో బుధవారం మత్తు పదార్థాలు వాటి వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత మత్తు పదర్థాలకు అలవాటు పడి జీవితాలను పాడుచేసుకోవద్దని చెప్పారు. గంజాయి, హెరాయిన్ వంటి మందుల వలలో యువత పడితే వారి జీవితం నాశనం చేసుకున్నట్లేనని తెలిపారు. తరువాత ఈగల్ క్లబ్‌ని ఏర్పాటు చేశారు. జనరల్‌హెడ్ డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ లెక్చరర్ రాజకుమార్, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లాజరస్

నాటుసారా నిర్మూలనే లక్ష్యం



నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చీరాల: నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు అన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని రామ్‌నగర్, ఆదినారాయణపురం, ఈపూరుపాలెం, దండుబాట, విజిలిపేట, చీరాల రూరల్ మండలంలోని సాయికాలనీ, వాడరేవు గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటుసారా ఉత్పత్తి, వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. నాటుసారా వలన కలిగే నష్టాలను, దుష్ప్రభావాలను తెలియచేసి నిర్మూలనకు చేయవలసిన ప్రణాళికలను ప్రచారరథం ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం.. ఉత్తరాయణం చైత్ర మాసం రోహిణి నక్షత్రం పంచమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆటిజమ్ రోగం కాదు



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి: ఆటిజమ్ అనేది జబ్బుకాదని భవిత కేంద్ర ఉపాధ్యాయుడు కొంగల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఆటిజమ్ డే సందర్భంగా బుధవారం పట్టణంలోని సత్రం బడిలో ఆటజమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇట్టా రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొంగల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటిజమ్ ఉన్న పిల్లలను తల్లిదండ్రులు వేరుగా చూడవద్దన్నారు. దీనికి ప్రత్యేకమైన మందులేవీ లేవని చెప్పారు. అయితే ప్రేమ ఆప్యాయతతో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో దాన్ని కొంతవరకు దూరం చేయవచ్చని చెప్పారు. థెరపీ శిక్షణ మంచి మందుగా ఉపయోగపడుతుందని చెప్పారు. వారిని సాధారణపిల్లలను వేరుగా చూడవద్దని చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు పోటీలు నిర్వహించి బహమతులు అందజేశారు. ఐఆర్‌గా ఉపాధ్యాయుడు యోనా, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ: వైకల్య చిన్నారులను ప్రోత్సహిస్తే ప్రతిభావంతులుగా తీర్చిదిద్దవచ్చని ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం ప్రపంచ ఆటిజమ్ దినోత్సవం సందర్భంగా బల్లికురవలోని భవిత కేంద్రంలో చిన్నారులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. వైకల్య చిన్నారుల పట్ల వివక్ష చూపకుండా సాధారణ పిల్లలతో సమానంగా పెంచుతూ మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. ఆటిజమ్ లక్షణాలను ఐఈఆర్టీలు నాగబాబు, నాజిని, పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు వివరించారు.



చిన్నారులకు పలకలు,పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫిజియోథెరపిస్టు

నేడు కలశ ప్రతిష్ఠ

మార్టూరు: స్థానిక ఈశాన్య వీధిలోని రామాలయంలో గురువారం రాముల వారి విగ్రహాలు, కలశం ప్రతిష్ఠ మహోత్సవం చేయనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గత కొన్నేళ్లుగా రామాలయంలో పూజాధికాలు జరగక పోవడంతో కొంత మంది భక్తులు తిరిగి రామాలయానికి పూర్వవైభవం తీసుకురావాలని, దేవాలయంలో నిత్య పూజలు జరిగే విధంగా చూడాలని ఇటీవల జీర్ణోద్ధరణ చేశారు. 1944లో సుమారు 80 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ పురాతన రామాలయంలో కొంతకాలంగా పూజా కార్యక్రమాలు నిలిచిపోయాయి. దాంతో కొంతమంది భక్తుల ఆర్థిక సహకారంతో గుడికి మరమ్మతులు చేపట్టి పూర్తిచే శారు. గుడి పైభాగాన ఉన్న కలశాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆపహరించటంతో ప్రస్తుతం భక్తులు కొత్తగా కలశాన్ని తయారు చేయించారు. గురువారం రాముల వారి విగ్రహాలు, కలశ ప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితుల సమక్షంలో నిర్వహించనున్నారు. స్థానిక దాత రాయుడు రామాంజనేయులు.. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి నూతన ఉత్సవ విగ్రహాల ఏర్పాటుకు సహకరించారు. ఈ నెల 11వ తేదీన శుక్రవారం ఒంటిమిట్ట రామాలయంలో కల్యాణం జరిగేరోజున ఈ రామాలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రతిష్ఠకు సిద్ధమైన ఉత్సవ మూర్తులు

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

చినగంజాం: మండలంలో గురువారం నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏ. శ్రీనివాసమూర్తి తెలిపారు. 0 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు అంగన్ వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు సహకారంతో రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడత 3 వ తేదీ సంతరావూరు, కడవకుదురు, 4వ తేదీ మోటుపల్లి గ్రామ పంచాయతీల్లో రెండో విడత 8వ తేదీ గొనసపూడి, పల్లెపాలెం, 9వ తేదీ చినగంజాం, కొత్తపాలెం, 10 వతేదీ మున్నం వారిపాలెం, పెదగంజాం, 11 వతేదీ రాజుబంగారు పాలెం, పెదగంజాం గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పకడ్బందీగా సర్వే పూర్తి చేయండి



బల్లికురవలో మాట్లాడుతున్న ఏపీఎం

బల్లికురవ: పేదరిక నిర్మూలనలో భాగంగా స్వయం సహాయక సంఘాల వార్షిక ప్రణాళిక సర్వేను ఎన్యూమనేటర్‌లు ఇంటింటా తిరుగుతూ లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని వెలుగు ఏపీఎం టి. రాజారావు కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపుల బోలపేతానికి ఎంపిక చేసిన ఎన్యూమరేటర్లకు శిక్షణ సమావేశం నిర్వహించారు. సర్వేలో సభ్యురాలి ఆదాయ వివరాలు, తీసుకున్న రుణాలు, జీవనోపాధులు యాప్‌లో నమోదు చేయాలని కోరారు. మహిళ సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, సీసీ పేరయ్య, బార్బార్ మిత్ర దమ్ము అంజయ్య మాట్లాడారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

యద్దనపూడి: సమాజంలో ప్రజలను ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎంఈఓ పుల్లెల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో రాబోయే మే నెలలో ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో యద్దనపూడి మండల మహిళా ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యతో పాటు విద్యార్థుల నైతిక జీవితానికి అవసరమైన సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను బోధించాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులంతా ఎంఈఓ పుల్లెల సుబ్రమణ్యం, ఎంఈఓ -2 చిలుకూరి గోపిలను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు కొర్రపాటి రాణి, అనురాధ, శారద, రామతులసి, అనీల, శ్రీలక్ష్మి, లక్ష్మి భవాని, శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఎంఈఓలను సత్కరిస్తున్న దృశ్యం